నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, బుధవారం 23 అక్టోబర్ 2024 | RANGAREDDY

### రాత్రి 11 నుంచి ఉదయం 6 గంటల వరకు..
## గచ్చిబౌలి ఫ్లై ఓవర్ మూసివేత

**ఎస్ఆర్‌డీపీ పనుల నేపథ్యంలో**
**28వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు**

సిటీబ్యూరో, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ ఎస్ఆర్‌డీపీ పనులలో భాగంగా శిల్పా లే అవుట్ ఫేస్-2 ప్రాంతంలో ఫ్లై ఓవర్ నిర్మాణం కారణంగా ఈ నెల 28వ తేదీ వరకు రాత్రి 11 నుంచి ఉదయం 6 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయెల్ డేవిస్ తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్ణీత సమయంలో గచ్చిబౌలి ఫ్లై ఓవర్‌ను మూసి వేస్తున్నట్లు వెల్లడించారు.

- ☞ బయోడైవర్సిటీ జంక్షన్ నుంచి ఐఐఐటీ జంక్షన్ వైపు వెళ్లే వాహనాలు గచ్చిబౌలి ఫ్లై ఓవర్ బైపాస్ చేస్తూ బిచ్చారెడ్డి స్వీట్స్ నుంచి గచ్చిబౌలి జంక్షన్ మీదుగా ఐఐఐటీ జంక్షన్‌కు చేరుకోవాలి.
- ☞ ఐఐఐటీ జంక్షన్ నుంచి బయో డైవర్సిటీ జంక్షన్‌కు వెళ్లే వాహనాలు గచ్చిబౌలి జంక్షన్ పక్క నుంచి బయోడైవర్సిటీ జంక్షన్‌కు వెళ్లాలి.



గత యేడాది అక్టోబర్ మలక్‌పేటలో ఐటీ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అప్పటి ఐటీ , పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్, హైదరాబాద్ ఎం.పీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు. (ఫైల్ )



అది అక్టోబర్ 1, మంగళ వారం: మూసానగర్, శంకర్‌నగర్‌లు కనుమరుగవుతున్న ఘటన. బుల్డోజర్లు, జేసీబీలు రాలేదు. రెడ్‌మార్క్‌తో వేలాడుతున్న ఇండ్లు మొత్తం 150. అప్పటి వరకు రెడ్ మార్క్ బోర్డులు తీసేయ్యాలని గొంతెత్తుతున్న స్థానికులు. కానీ ఆ రోజు రేవంత్ సర్కార్.. సుమారు 90 మంది లేబర్లతో ఆపరేషన్ మూసీ చేపట్టింది. ఇండ్లపై కప్పలు తొలగించి గోడలను ధ్వంసం చేశారు. తమ ఇండ్లను కూల్చొద్దంటున్నా.. బలవంతంగా ఖాళీ చేయించి కూలుస్తున్నారంటూ బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు.

**సీన్ కట్ చేస్తే..!**

ఆ కూల్చివేతలు మూసీ బాధితులే స్వయంగా చేసుకున్నారు. వారి ఇండ్లను వాళ్లే కూల్చుకున్నారు. సర్కార్‌కు ఆ కూల్చివేతలతో సంబంధం లేదు.'' ఇది సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ లెక్కన శంకర్‌నగర్, మూసానగర్‌లో అధికారులు వారి ఇండ్లపై రెడ్ మార్క్ వేసినప్పటి నుంచి నిద్ర లేని రాత్రులు గడపటం అబద్ధమా? ఎన్నో ఏండ్ల నుంచి నిర్మించుకున్న ఇండ్లను వాళ్లే స్వయంగా కూల్చుకున్నారనడం సమంజసమా? ఎవరి ప్రయోజనాల కోసం ఎవరిని బలి చేస్తున్నారు? అంటూ సామాజిక కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.

- బుల్డోజర్లు వస్తే.. జనం తిరుగబడతారనే భయం
- 90 మంది లేబర్లతో కూల్చివేయించిన సర్కార్
- మూసానగర్, శంకర్‌నగర్ కూల్చివేతల ఖర్చు చెల్లింపులపై సందిగ్ధం
- సొంతంగా ప్రజలే తమ ఇండ్లను కూల్చుకున్నారంటూ సీఎం ప్రగల్భాలు

**రెవెన్యూ వర్సెస్ ఎంఐఎం**

# మూసీ ఇండ్లను సర్కారే కూల్చింది!

## రూ.2.40లక్షలు ఖర్చు.. ఎవరు ఇవ్వాలని పంచాయితీ

సిటీబ్యూరో, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ) : మూసీ కూల్చివేతల వెనక సర్కార్ ఓ మాస్టర్ ప్లాన్ అమలు చేసిందా? జేసీబీలు, బుల్డోజర్లు రంగ ప్రవేశం చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమం ఎగిసిపడే ప్రమాదం ఉందని ముందే ఊహించిందా? అందుకే ఆ బుల్డోజర్లను పక్కనపెట్టి లేబర్లను రంగంలోకి దించిందని రాజకీయ నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఆ కూల్చివేతలు సర్కార్ ఖాతాలో పడకుండా చేతికి మట్టి అంటకుండా పనిఅయ్యేలా వ్యూహం పన్నినట్టు తెలుస్తోంది. అందులో భాగంగా సుమారు 90 మంది లేబర్లను రంగంలోకి దించి వారితో మూసానగర్, శంకర్‌నగర్ ఇండ్లను కబలించింది. ఇందుకోసం వారికి అయిన ఖర్చు రూ. 2 లక్షల 40వేలు. ఇప్పుడు ఈ డబ్బులే అసలు వ్యూహాన్ని బయటపెట్టాయి. ప్రజలే సొంతంగా ఇండ్లను కూల్చుకుంటే లేబర్లను పెట్టి డబ్బులు ఇచ్చింది ఎవ్వరు? ఎవరి ఖాతా నుంచి ఆ డబ్బులు లేబర్లకు చేరాయి? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అయితే స్థానిక ఎంఐఎం ఎమ్మెల్యే ఆ లేబర్లకు డబ్బులు చెల్లించారని కొందరు అధికారులు తెలిపారు. ఇదే సమయంలో ఆ డబ్బులను తాము ఎందుకు భరించాలంటూ రెవెన్యూ వాళ్లే ఇవ్వాలంటూ అధికారులకు సమాచారం ఇచ్చారు. కూల్చివేతల శిథిలాలను తరలించేందుకు నేడో, రేపో అధికారులు టెండర్ ఖరారు చేయనున్నారు. సదరు ఏజెన్సీ నుంచే కూల్చివేతలకు డబ్బులు కేటాయించడానికి కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం కలెక్టర్ వద్ద ఫైల్ పరిశీలనలో ఉన్నట్టు సమాచారం.



### మిగిలిన కూల్చివేతలు సాధ్యమా?

150 ఇండ్ల కూల్చివేతల్లోనే అధికారులు నానా అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇక రివర్ బెడ్‌లో ఉన్న మొత్తం 2,166 నిర్మాణాలను కూల్చివేయడం కుదురుతుందా అని అధికారులు సైతం తలలు పట్టుకుంటున్నారు. మిగిలిన నిర్మాణాలు వాళ్లే కూల్చుకున్నారంటూ నెట్టేయడం కూడా సాధ్యం కాని దుస్థితి. ఇలాంటి సందర్భంలో మూసీ కూల్చివేతలు సాధ్యమవుతాయా? లేదా? అనే సందేహం సైతం అధికారులను వెంటాడుతుంది. కాగా, కూల్చివేతల ప్రక్రియ కోసం పర్యవేక్షించడానికి అధికారులు అన్ని శాఖల అధికారులతో టీంను ఏర్పాటు చేసింది. వాళ్లంతా రివర్ బెడ్ పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తున్నారు. మిగిలిన చోట్ల స్థానిక ఎమ్మెల్యేలు కూల్చివేతలను వ్యతిరేకిస్తున్నారు. ఇలాంటి సందర్భంలో ఎలా ముందుకెళ్లాలో తెలియక అధికారులు సతమతమవుతుండటం విశేషం.

### క్షణక్షణం..నరకం..!

మూసీ నిర్వాసితులు తమ ఇండ్లను కూల్చొద్దంటూ ఓ వైపు ఉద్యమిస్తూనే.. మరోవైపు కోర్టును ఆశ్రయిస్తున్నారు. ఆలయాలపై సైతం రెడ్ మార్క్ వేశారంటూ పేట్లబుర్జు వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై కోర్టు నుంచి స్టేటస్ కో సైతం పొందారు. అధికారులకు సైతం నిబంధనల ప్రకారం నడుచుకోవాలని న్యాయస్థానం సూచించినట్టు తెలిపారు. మరోవైపు మూసీ బాధితులకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్‌లలో సరైన వసతులు లేకపోవడంతో ఇప్పటికీ వాళ్లంతా ఇబ్బందులు పడుతున్నారని బాధితులు చెబుతున్నారు. ఉమ్మడి కుటుంబాలుగా జీవించిన వారికి ఒకే డబుల్ బెడ్ రూం కేటాయించడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రివర్ బెడ్‌లో ఉన్న 2166 నిర్మాణాలను తొలగించడం అధికారులకు కత్తిమీద సాములా మారింది. అందుకే ఈ ప్రక్రియకు ప్రభుత్వం బ్రేకులు వేసింది. మరోవైపు కూల్చివేతలు తప్పవని చెబుతున్నప్పటికీ ప్రజలు ఏ విధంగా ఎదుర్కొంటారో తెలియని పరిస్థితి అధికారుల్లో ఉంది. అందుకే రోజుకు కొన్ని కుటుంబాలతో అధికారులు సమావేశమై బలవంతంగా ఒప్పిస్తున్నట్టు బాధితులు చెబుతున్నారు.

### పునాదులకే పరిమితం..
# మలక్‌పేట ఐటీ టవర్

ఐటీ రంగం అభివృద్ధిపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం

10 నెలలు గడిచినా పట్టించుకోని వైనం.?

మలక్‌పేట ఐటీ టవర్ నిర్మాణం నిర్లక్ష్యంపై కేటీఆర్ ట్వీట్

**ఐటీ రంగం** అభివృద్ధి పై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. అధికారంలోకి వచ్చినా ఐటీ రంగానికి సంబంధించిన ప్రాజెక్టుల పురోగతిని ముందుకు తీసుకెళ్లడం లేదు. ప్రైవేట్ ఐటీ కంపెనీల కార్యక్రమాల్లో తప్ప, ప్రభుత్వ పరంగా చేయాల్సిన ప్రాజెక్టులను పూర్తిగా పక్కన పెట్టారు. అందుకు నిదర్శనం మలక్‌పేట ఐటీ టవర్ నిర్మాణమే. నగరంలోని మలక్‌పేటలో గతేడాది అక్టోబర్‌లో శంకుస్థాపన చేసిన ఐటీ పార్క్ టవర్ పనులు ఒక్క అంగుళం కూడా ముందుకు కదలలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు అవుతున్నా, ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. మలక్‌పేటలో ప్రభుత్వ ఐటీ టవర్‌ను నిర్మిస్తే వేలాది మందికి ఉద్యోగావకాశాలు వస్తాయనుకున్న వారి ఆశలన్నీ నీరుగారిపోయాయి.

- సిటీబ్యూరో, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ):

**దేశ ఐటీ రంగంలో** బెంగళూరు తర్వాత హైదరాబాద్ అగ్ర స్థానంలో ఉంది. ఐటీ రంగానికి దోహదం చేసేలా ప్రభుత్వ విధానాలు, అత్యంత మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తే ఆ రంగం మరింత విస్తరించేందుకు అవకాశాలున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం ఐటీ రంగం అభివృద్ధికి గ్రేటర్ హైదరాబాద్‌లోనే కాకుండా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఐటీ టవర్లను నిర్మించి, దేశ, విదేశాల నుంచి ఐటీ కంపెనీలు వచ్చేందుకు వీలుగా మౌలిక వసతులు కల్పించింది. దానివల్లే వెస్ట్ హైదరాబాద్ ఐటీ రంగం ఎంతో వేగంగా విస్తరించింది. దాన్ని అలాగే ముందుకు తీసుకెళ్లాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం ఐటీ రంగాన్ని మరింత వృద్ధి చేసేందుకు చొరవ తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**రూ.700 కోట్లతో ఐటీ టవర్...**

మలక్‌పేటలో ఉన్న 11 ఎకరాల ప్రభుత్వ స్థలంలో సుమారు రూ.700 కోట్లతో ఐటీ టవర్‌ను నిర్మించేందుకు కేసీఆర్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఐటీ టవర్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే బాధ్యతను తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీఎస్ఐఐసీ)కు అప్పగించింది. టవర్‌లో ఏకంగా 15 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ కంపెనీ కార్యకలాపాలను నిర్వహించుకునేలా డిజైన్ చేశారు. ముఖ్యంగా పాత నగరమైన మలక్‌పేటకే పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చే ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఐటీ టవర్ నిర్మాణం నిర్లక్ష్యంపై కేటీఆర్ ట్వీట్..**

ఎన్నో దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని పాతనగరంలో ఐటీ టవర్ నిర్మించాలన్న ఆలోచనలతో గత కేసీఆర్ ప్రభుత్వం మలక్‌పేటలో ఐటీ టవర్ నిర్మించాలని ప్రతిపాదనలు రూపొందించి, నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. అలాంటి ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఆయా రంగాల అభివృద్ధికి, ప్రజల మెరుగైన జీవనోపాధికి దోహదం చేసే ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని ట్వీట్ చేశారు.

**ఐటీ టవర్ పూర్తయితే ఉద్యోగావకాశాలు : మంత్రి కేటీఆర్**

మలక్‌పేట, సైదాబాద్, సంతోష్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్ సహా రాష్ట్రంలోని యువతకు దాదాపు 50వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది ఈ ఐటీ పార్క్ లక్ష్యం. గతేడాది అక్టోబర్‌లో ఐటీ మంత్రిగా నేనే శంకుస్థాపన చేశాను. మూడేళ్లలో ఐటీ పార్కును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో ఐటీని విస్తరించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసింది. ఆ ప్రయత్నాలను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని ఐటీ మంత్రి శ్రీధర్ బాబును కోరుతున్నా.



## మెట్రో కోచ్‌లకు పైసల్లేవ్?

డబ్బులు వెచ్చించడానికి మొగ్గు చూపని ఎల్ అండ్ టీ మెట్రో

ఉన్న కోచ్‌లతోనే సర్దుబాటు.. ఎన్నాళ్లో ఎదురుచూపులు

ఎల్ అండ్ టీ మెట్రో తీరుపై ప్రయాణికుల అసహనం

సిటీబ్యూరో, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): నిర్ణీత సమయంలో కచ్చితంగా గమ్య స్థానానికి చేరుస్తుంది. వాయు కాలుష్యంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న నగర వాసులకు ఊరటనిస్తుంది. అలాంటి ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో రైలు మొదటి స్థానంలో ఉంటుంది. హైదరాబాద్ మహానగరంలో ప్రజాదరణ పొందిన మెట్రో రైలులో నిత్యం 5లక్షలకు పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే రోజు రోజుకూ గణనీయంగా పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా మెట్రో రైల్ కోచ్‌లను పెంచడంలో ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ కాలయాపన చేస్తోంది. ప్రయాణికుల డిమాండ్లను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నగరవాసులు నిత్యం కిక్కిరిసిన మెట్రో కోచ్‌ల్లోనే ప్రయాణం చేస్తూ నరకం అనుభవిస్తూనే ఉన్నారు.

### కోచ్‌లు కొనడానికి డబ్బుల్లేవ్...?

మూడు కోచ్‌లు ఉన్న మెట్రోలో మరో 3 కోచ్‌లను అనుసంధానం చేయాలన్న డిమాండు ఏడాది నుంచి ఉంది. అయినా ఎల్ అండ్ టీ మెట్రో మాత్రం ఆ దిశగా ఆలోచించలేదు. ఈ విషయమై ఎల్ అండ్ టీ మెట్రో యంత్రాంగాన్ని సంప్రదిస్తే అదనంగా మెట్రో కోచ్‌లు కొనడానికి డబ్బుల్లేవనే విషయాన్ని చెబుతున్నారు. కొన్నాళ్ల పాటు ఉన్న కోచ్‌లతోనే నడిపిస్తామని, ఆర్థికంగా లాభాలు వస్తే తప్ప ఇప్పటికిప్పుడు కొత్త కోచ్‌లను తీసుకురాలేని పరిస్థితిలో ఎల్ అండ్ టీ మెట్రో ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగరంలో ఆరేండ్ల క్రితం ప్రారంభమైన సమయంలో తీసుకొచ్చిన మెట్రో రైళ్లనే ఇప్పటికీ వాడుతున్నారు. ప్రతియేటా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కోచ్‌లను పెంచాలని ఉన్నా లాభాలు రావడం లేదని, ఇంకా తీవ్ర నష్టాల్లోనే ఉన్నామని.. అదనపు కోచ్‌ల కొనుగోలు విషయాన్ని దాట వేస్తూ వస్తున్నారు. మూడు కోచ్‌లతో కూడిన ఒక్కో మెట్రో రైలును అదనంగా కొనుగోలు చేయాలంటే రూ.10 కోట్ల దాకా అవుతుంది. ప్రస్తుతం ఉన్న 59 మెట్రో రైళ్లలో సగం రైళ్లకు అదనంగా కోచ్‌లను జతపర్చాలంటే రూ.300 కోట్ల దాకా అవుతుంది. ఆ మొత్తాన్ని సైతం భరించేందుకు సిద్ధంగా లేదు. ఉన్న కోచ్‌లతోనే నిర్వహణ చేపట్టాలని, అవసరమైతే ఫ్రీక్వెన్సీ పెంచి నడుపుతామని చెబుతున్నారే తప్ప మెట్రో కోచ్‌లను తీసుకువస్తామన్న విషయం చెప్పడం లేదు.

### మెట్రో ఆదరణ ఉన్నా ఆదుకునే వారేరి...?

నగరంలో ట్రాఫిక్ సమస్యలతో ప్రయాణికులు గంటల పాటు బస్సుల్లో ప్రయాణం చేయాల్సి వస్తోంది. నిర్ణీత సమయంలో ప్రయాణికులు గమ్య స్థానానికి చేరుకోవాలంటే మెట్రో రైళ్లే ఏకైక మార్గంగా మారాయి. అలాంటి మెట్రో రైలును ఆదుకోవాల్సిన అవసరం ఉన్నా, కాలయాపన చేస్తున్నారే తప్ప ప్రయాణికుల అవసరాలను తీర్చేందుకు ముందుకు రావడం లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మెట్రో కోచ్‌ల పెంపు విషయంలో చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# చేయిచ్చారు..



ఈ ఏడాది చేప పిల్లల పంపిణీకి కాంగ్రెస్ ప్రభుత్వం 'చే'యిచ్చింది. మూడు సార్లు టెండర్లు పిలిచినా ఫలితం లేదు. అర్హత గల కంపెనీలు రాకపోవడంతో టెండర్లను ఖరారు చేయలేకపోయామని అధికారులు చెబుతున్నారు. ఇతర జిల్లాల్లో చేప పిల్లల పంపిణీని చేపడుతున్న గుత్తేదార్లను రిక్వెస్ట్ చేసినా నో చెప్పడంతో ఈసారి పంపిణీకి రాంరాం పలికినట్లేనన్న టాక్ వినిపిస్తున్నది. అక్టోబర్ నెల ముగిసేందుకు వచ్చినా చేప పిల్లలను చెరువుల్లోకి వదలకపోవడంతో ఇప్పుడు వదిలినా.. లాభం లేదన్న అభిప్రాయం మత్స్యకారుల్లో వ్యక్తమవుతున్నది. జిల్లాలో చేపల వేటనే నమ్ముకుని 9,136 కుటుంబాలు జీవిస్తుండగా...ఈ ఏడాది తమకు జీవనోపాధి ఎట్లా అని మథనపడుతున్నారు. చేప పిల్లల పంపిణీకి సంబంధించిన నిధులను మత్స్య సహకార సొసైటీలో జమ చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

-రంగారెడ్డి, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ)

### ఈ ఏడాది జీవనోపాధి ఎట్లా?..

జిల్లాలో 120 మైనర్ ఇరిగేషన్ చెరువులు, 978 చెరువులు ఉన్నాయి. వీటి పరిధు ల్లో 186 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలుండగా..అందులో 9,136 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. కేసీఆర్ హయాంలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేవారు. కానీ.. ఈసారి ఆ సందడి ఎక్క డా కనిపించడం లేదు. చేప పిల్లల పంపిణీకి సంబంధించి ఇప్పటివరకు టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కాలేదు. ఇకనైనా పంపిణీ చేసే అవకాశం ఉన్నదా అంటే అధి కారుల నుంచీ స్పష్టత లేదు. గతంలో ప్రతిఏటా చేప పిల్లల పంపిణీని జూలైలోనే పూర్తి చేసేవారు. ఏవైనా అవాంతరాలు ఏర్పడితే ఆగస్టు మొదటి వారంలో పూర్తి అయ్యేది. ఇందుకోసం ప్రభుత్వం ఏప్రిల్ నుంచే సన్నాహాలు ప్రారంభించేది. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో పెంచేందుకు 80 ఎంఎం నుంచి 100 ఎంఎం సైజు చేప పిల్లలను..అదేవిధంగా చెరువులు, కుంటల్లో పెంచేందుకు 35 ఎంఎం నుంచి 400 ఎంఎం సైజులో ఉండే పిల్లలను పంపిణీ చేసేది. అయితే ఈసారి ఇంకా టెండర్ల ప్రక్రియ పూర్తికాకపోవడంతో చేప పిల్లల పంపిణీపై నీలినీడలు కమ్ముకున్నాయి. చేపల వేటనే జీవనాధారంగా బతుకుతున్న మత్స్యకార కుటుంబాలు ఈ ఏడాది జీవనోపాధి ఎట్లా? అని ఆందోళన చెందుతున్నారు.



### ఆసక్తి చూపక.. అర్హత కంపెనీలు రాక..

ఈ ఏడాది జిల్లాలోని 813 చెరువుల్లో కోటీ 93 లక్షల చేప పిల్లలను వదలాలని జిల్లా మత్స్యశాఖ ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ఈ మేరకు అధికారులు జూలై 10న టెండర్లు పిలిచినా ఒక్కరూ బిడ్ దాఖలు చేయలేదు. గడువును 23వ తేదీకి పెంచినా ఫలితం లేదు. దీంతో గడువును ఆగస్టు 13కు పెంచి రెండోసారి టెండర్లు పిలిచినా గుత్తేదార్ల నుంచి స్పందన రాలేదు. ముచ్చటగా మూడోసారి టెం డర్లు పిలిచిన ప్రభుత్వం బిడ్ దాఖలుకు ఈనెల 19వ తేదీకి గడువును పెంచింది. చివరగా పిలిచిన టెండర్లలో నల్లగొండ, కైకలూరు, మచిలీపట్నం ప్రాంతాలకు చెం దిన గుత్తేదార్లు టెండర్లలో పాల్గొన్నారు. అయితే చేప పిల్లలను సరఫరా చేసే సా మర్థ్యం ఆయా గుత్తేదార్లకు సంబంధించిన కంపెనీలకు లేని కారణంగా అధికారు లు డిస్ క్వాలిఫై చేశారు. జనగామలో చేప పిల్లల పంపిణీ కాంట్రాక్టును దక్కించుకున్న గుత్తేదారును రంగారెడ్డి జిల్లాలోనూ పంపిణీ చేయాల్సిందిగా అధికారులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలను సైతం పంపించారు. అయితే సదరు గుత్తేదారు ఆసక్తి చూపకపోవడంతో చేప పిల్లల పంపిణీ ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. ప్రభుత్వం మరో గుత్తేదారును సూచిస్తే..జిల్లాలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపడతామని అధికారులు చెబుతున్నారు.

**చేపల పంపిణీని అటకెక్కించిన కాంగ్రెస్ ప్రభుత్వం**

- అక్టోబర్ నెల ముగిసేందుకొచ్చినా చెరువులకు చేరని చేప
- మూడుసార్లు టెండర్లు పిలిచిన అధికారులు
- అర్హత ఉన్న కంపెనీలు లేకనే టెండర్లు ఖరారు చేయలేదంటున్న అధికారులు
- ప్రస్తుతం చేప పిల్లలను చెరువుల్లో వదిలినా ఫలితం లేదంటున్న మత్స్యకారులు
- రంగారెడ్డి జిల్లాలో చేపల వేటనే నమ్ముకుని జీవిస్తున్న మత్స్యకారులు 9,136 మంది
- చేప పిల్లల పంపిణీ నిధులను మత్స్య సహకార సొసైటీల్లో జమ చేయాలని వినతి

### కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్న మత్స్యకారులు..

మిషన్ కాకతీయ పథకంతో చెరువులను అభివృద్ధి చేసిన కేసీఆర్ ప్రభుత్వం మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అనేక కార్యక్రమాలను చేపట్టింది. అం దులో భాగంగానే మత్స్యకారులకు ఏడాది పొడవునా జీవనోపాధి కల్పించి ఆర్థిక భరోసా కల్పించేలా ఉచిత చేప పిల్లలను పంపిణీ చేసింది. 2016-17లో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని మొదలుపెట్టి ఏడేండ్ల పాటు నిర్విఘ్నంగా కొనసాగించింది. గడిచిన ఏడేండ్లలో 6.63 కోట్ల చేప పిల్లలను ఉచితంగా అందజేయ గా..అందుకోసం రూ.4.40 కోట్ల వరకు ఖర్చుచేసింది. ఈ మేరకు 41,753 మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తితో రూ. 56.59 కోట్ల ఆదాయం ఒనగూరింది. జలాశయాల్లో ఉచితంగా వదిలిన బొచ్చ, రాహు, బంగారు తీగ, రొయ్య, ముల్లంగి తదితర చేపలతో మత్స్యకారులు ఏడాది పొడవునా ఉపాధిని పొందారు. ఈ ప్రాంతానికి చెందిన చేపలు ఇతర రాష్ట్రాలకూ ఎగుమతి అయ్యాయి. చేప పిల్లలను వేటాడేందుకు వలలు, రవాణా కోసం ద్విచక్ర వాహనాలు, లగేజీ ఆటోలు, బొలెరో వా హనాలను అందించింది. అలాగే మహిళా సహకార సంఘాలకు విరివిగా రుణాలను అందించడంతోపాటు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాలను నిర్వహించి ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకున్నది. గత ప్రభుత్వం కల్పించిన భరోసాతో మత్స్యకారుల జీవితాల్లో పెను మార్పులొచ్చాయి. ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయి. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం అటకెక్కడంతో కేసీఆర్ పాలనను మత్స్యకార కుటుంబాలు గుర్తు చేసుకుంటున్నాయి.